

మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలో హైడ్రా తరహా కూల్చివేతలు..


# పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

## తెలంగాణ రౌండప్

శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 పేజీలు 8


# “హైడ్రా” తరహాలో... మంచిర్యాల కూల్చివేతలు

## రాష్ట్ర రాజధాని నుండి.. జిల్లాలకు పాకిన ‘హైడ్రా’ చర్యలు..

## ఓ బీఆర్ఎస్ నేతకు చెందిన “ఐదంస్తుల” అక్రమ నిర్మాణం నేలమట్టం..

-2లో

- మంచిర్యాల నస్పూర్ పురపాలిక పరిధిలో ఉద్రిక్తత వాతావరణం..
- సర్వే నెంబర్ 40లో అనుమతులు.. సర్వే నెం.42 ప్రభుత్వ భూమిలో ఐదంస్తుల కట్టడ..
- పనులు నిలిపివేయాలని మూడేళ్లుగా నోటీసులు జారీచేసినా..! పట్టించుకోని వైనం..!
- బీఆర్ఎస్ నేత డీకొండ అన్నయ్యకి చెందిన అక్రమ నిర్మాణం కూల్చివేతకు భారీ పోలీసు బందోబస్తు..
- కూల్చివేస్తున్న భవనం సుమారు రూ.4 కోట్లు ఖర్చుతో నిర్మించారని బాధితులు వాపోయారు..
- మరోవైపు నిర్మాణానికి అధికారులే అనుమతులు ఇచ్చారని బాధితులు కంట తడి పెడుతున్నారు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఇప్పుడు ‘హైడ్రా’ స్ఫూర్తితో, అదే తరహాలో అధికారులు చర్యలకు దిగుతున్నారు..ఎక్కడో ఓచోట కొద్దిపాటి వ్యతిరేకత ఉన్నప్పటికీ..! అది కేవలం కబ్జాదారులదే కనుక, ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు.. రాజధాని శివార్ల వరకే హైడ్రా పరిమితమైనప్పటికి.. పలు జిల్లాలకు హైడ్రాను విస్తరించాలని ప్రజ కోరుకుంటున్నారు.. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం జిల్లాలోను చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడితే హైడ్రా స్ఫూర్తితో చర్యలు చేపట్టాలనే ఆదేశాలు.. ఇప్పుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతుంది.. గురువారం మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపల్ పరిధిలోని ఐదంస్తుల అక్రమ నిర్మాణం కూల్చివేత అందుకు నిదర్శనం.. కబ్జా చేయాలంటేనే వణుకు పుట్టించేలా అక్రమ కట్టడాలను భూ స్థాపితం చేస్తున్నారు..

స్టేట్ బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 19:



నేలమట్టం అయిన ఐదంస్తుల అక్రమ నిర్మాణం..

# సూరారం మార్కెట్‌లో.. వినాయక నిమజ్జనం వేడుకలు..



- మార్కెట్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనం..
- రెండు లడ్డూలు రూ.2 లక్షలకు వేలంపాటలో పాడినట్లు ఉత్సవ కమిటీ వెల్లడి..
- వేలంపాటలో పండరి పూజా స్టోర్స్ పెద్ద లడ్డును రూ.1.31 లక్షలకు కైవసం చేసుకున్నారు..
- పులిమామిడి పవన్ చిన్న లడ్డును రూ.75 వేలకు సొంత చేసుకున్నారు..

-3 లో

# వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం పక్కా..

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం పక్కా అని అన్నారు. అంకురిత దీక్షతో రాహుల్ బడుగు బలహీనవర్గాల కోసం పనిచేస్తున్నారని అన్నారు. తాను రాహుల్ గాంధీ వదిలిన బాణమని, సోనియా, ఖర్గేల సందేశాన్నని అన్నారు.

-2 లో



# "హైడ్రా" తరహాలో.. మంచిర్యాల కూల్చివేతలు..

## నిర్మాణ దశలో చోద్యం చూశారు.. ఇప్పుడు కూల్చేస్తున్నారు..

కూల్చివేతలు సక్రమమే అయినప్పటికీ ప్రజల్లో కొంత వ్యతిరేకత ఏర్పడుతుంది.. అక్రమ కట్టడాలను నివారించ కుండా, సహకరించిన అధికారులను వదిలేసి..! వార్ వన్‌సైడ్ అన్న చందంగా వ్యవహరిస్తూ..! బాధితులనే దోషులుగా నిర్ధారించడం సరైనది కాదని విమర్శలు వస్తున్నాయి.. మంచిర్యాల కూల్చివేతల్లో అధికారుల వైఫల్యం కూడా ఉందని స్పష్టమవుతుంది.. ఐదేళ్ళ క్రితం నిర్మించిన ఐదంస్తుల నిర్మాణం అధికారులకు తెలియకుండానే జరిగిందా అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.. ప్రారంభంలో లనే అధికారులు అడ్డుకుని ఉంటే తాము రూ.4 కోట్లు వెచ్చించి భవనం నిర్మించే వాళ్లంకాదని ఆవేదన చెందారు.. కనీసం ఇంట్లో ఉన్న వస్తువులు కూడా తీయకుండా అడ్డుకున్నారని కన్నీరు మున్నీరుగా విలపించారు..



- మొదటి పేజి తరువాయి

హైదరాబాదు 'హైడ్రా' ఎఫెక్ట్ జిల్లాలకు పాకింది తాజాగా గురువారం మంచిర్యాల జిల్లాలో ఐదంస్తుల అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు నేలమట్టం చేశారు.. ఏదిఏమైనప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి మానస పుత్రిక "హైడ్రా" ప్రజల మన్ననలు పొందుతోంది.. ఎక్కడపడితే అక్కడ అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపట్టే అక్రమార్కులకు సింహస్వప్నంగా తయారైంది.. హైడ్రా తరహాలోనే రోజు రోజుకు జిల్లాలకు వ్యాపిస్తుంది.. గత పాలకుల ఆగడాలకు కనుమరుగైన చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలను తొలగించి స్వాధీన పరచుకునే మహా యజ్ఞాన్ని ప్రభుత్వ తలపెట్టింది..మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపల్ పరిధిలోని ఓ బీఆర్ఎస్ నాయకుని ఐదంస్తుల అక్రమ కట్టడాన్ని మున్సిపల్ అధికారులు నేలమట్టం చేశారు.. ఒక సర్వే నెంబర్‌పై అనుమతి తీసుకుని.. మరో సర్వే నెంబర్‌లో నిర్మాణం చేపట్టారు.. పలుమార్లు నోటీసులు ఇచ్చినా బేఖాతర్ చేసిన బీఆర్ఎస్ నేతకు చెందిన ఐదంస్తుల భవన నిర్మాణం భూ స్థాపితం చేశారు..

## హైడ్రా స్ఫూర్తితో.. మంచిర్యాలలో మున్సిపల్ కూల్చివేతలు..

మంచిర్యాల జిల్లాలోనూ హైడ్రా తరహాలో కూల్చివేతలు ప్రారంభమయ్యాయి.. నస్పూర్ మున్సిపాలిటీ కలెక్టరేట్‌కి వెళ్ళేదారిలో ఉన్న సర్వే నెంబర్ 42 ప్రభుత్వ భూమిలో, బీఅర్ఎస్ నేత డీకొండ అన్నయ్యకి చెందిన ఐదంతస్తుల భవనాన్ని భారీ పోలీసు బందోబస్తు నడుమ మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు.. అక్రమ నిర్మాణ దారున్ని,బయటకు వెళ్ళిన సమయంలో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారని బాధితులు మీడియాతో ప్రస్తావించారు.. అక్రమ నిర్మాణదారులు అన్నయ్య సర్వే నెంబర్ 40 భూమిలో, డాక్యుమెంట్‌లతో అనుమతులు తీసుకుని.. సర్వే నెంబర్ 42 ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని రెవెన్యూ నివేదికతో చర్యలు చేపడుతున్నట్లు నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్ మీడియాతో తెలిపారు.. 2022 నుంచి నోటీసులు ఇస్తున్నప్పటికీ డీకొండ అన్నయ్య పట్టించుకోలేదని చెప్పారు. 15 రోజుల క్రితం కూడా నోటీసులు జారీ చేశామని కమిషనర్ పేర్కొన్నారు.. అయినప్పటికీ స్పందించక పోవడంతో పోలీసుల రక్షణతో కూల్చివేస్తున్నట్లు తెలిపారు.. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని అక్రమ కట్టడాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. త్వరలోనే వాటిని సైతం కూల్చివేస్తామని తెలిపారు..

# వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం పక్కా..

- మొదటి పేజి తరువాయి

పదేండ్లు బిసిలను అణగదొక్కిన బిఆర్ఎస్ కు మాట్లాడే నైతిక హక్కులేదని అన్నారు. స్థానిక సంస్థల్లో బిసిల వాటా ఇవ్వలేదని, దమ్ముంటే బిఆర్ఎస్ ప్రెసిడెంట్ గా బిసిని చేయలేని సవాల్ విసిరారు.చక్కగా పనిచేసే బండి సంజయ్ ని ప్రెసిడెంట్ పోస్ట్ నుండి తప్పించారని, బీసీ నేత బండి సంజయ్ కు కేంద్రమంత్రి పదవి ఇవ్వకుండా సహాయ మంత్రి ఇస్తారా అని ప్రశ్నించారు. బీసీల విషయంలో రేవంత్ కమిట్మెంట్ గా వున్నారని అన్నారు.కాంగ్రెస్ మూలసూత్రం కూడా అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇవ్వడమేనని అన్నారు.

సీఎం రేవంత్ సహా కాంగ్రెస్ లో ప్రతిఒక్కరు రాహుల్ సైనికులమేనని స్పష్టం చేశారు. బిసీ కులగణన జరగనిదే స్థానిక సంస్థల ఎన్నికలకు పోకూడదని అనుకున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ దూరదృష్టి ఉన్న నాయకుడని, ఆయనతో కలిసిపనిచేస్తామని అన్నారు. పీసీసీ ఎంపిక విషయంలో పొన్నం, సీతక్కల పేర్లు కూడా వచ్చాయని, కానీ వారిద్దరూ తన పేరు చెప్పడం సంతోషమని అన్నారు.

ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం పెడ్తే గగ్గోలు పెడుతున్నారని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కల అని అన్నారు. విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, బిజెపి, బిఆర్ఎస్ మాటలు ఎవరు నమ్మరని అన్నారు. బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని అన్నారు. కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగా ఐదేండ్లపాలన ఉంటుందని అన్నారు.

కులాన్ని పక్కన పెట్టి బీసీలుగా ఐక్యం అవ్వాలని, బీసీలుగా ఎదగాలంటే కులాన్ని పక్కన పెట్టాలని పిలుపునిచ్చారు మహేష్ కుమార్ గౌడ్. బీజేపీ దేవుడి పేరిట, మతాల పేరిట ఓట్లు అడిగే పార్టీ అని అన్నారు. బిఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయం చేస్తుందని,ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని అన్నారు.

# సూరారం మార్కెట్‌లో.. వినాయక నిమజ్జనం వేడుకలు..

- మార్కెట్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనం..
- రెండు లడ్డూలు రూ.2 లక్షలకు వేలంపాటలో పాడినట్లు ఉత్సవ కమిటీ వెల్లడి..
- వేలంపాటలో పండరి పూజా స్టోర్స్ పెద్ద లడ్డును రూ.1.31 లక్షలకు కైవసం చేసుకున్నారు..
- పులిమామిడి పవన్ చిన్న లడ్డును రూ.75 వేలకు సొంత చేసుకున్నారు..



సూరారం మార్కెట్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విగ్నేషుడు..


లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో రూ.1.31 లక్షలకు సొంత చేసుకున్న పండరి పూజా స్టోర్స్..



రూ.75 వేలకు మరో లడ్డు ప్రసాదం కైవసం చేసుకున్న భక్తుడు, అసోసియేషన్ సభ్యులు ప్రేమ్‌కుమార్..

**జీడిమెట్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** కుత్బుల్లాపూర్‌లో గణేష్ నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు.. సూరారం మార్కెట్‌లో మార్కెట్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం అంగరంగవైభవంగా శోభాయాత్రను నిర్వహించారు.. నవరాత్రులు అత్యంత నిష్టతో పూజలు నిర్వహించి, చివరి రోజున స్వామివారి లడ్డు ప్రసాదానికి భక్తులు పోటీపడగా..!గణేష్ ఉత్సవ కమిటీ నిర్ణయం మేరకు వేలంపాట నిర్వహించారు.. వేలం పాటలో పెద్ద లడ్డు ప్రసాదాన్ని రూ. 1.31 లక్షలకు సూరారం మార్కెట్‌లోని పండరి పూజ స్టోర్స్ కైవసం చేసుకోగా.. చిన్న లడ్డు ప్రసాదాన్ని రూ. 75 వేలకు పులిమామిడి పవన్ సొంతం చేసుకున్నారు.. వినాయక శోభ యాత్రలో సూరారం మార్కెట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, పెద్దలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు.. బుధవారం రాత్రి ఆలస్యంగా సూరారం కట్టమైసమ్మ చెరువులో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఓం శాంతి పండిత్, ప్రేమ్ చందర్, ప్రభాకర్ గుప్త, అర్జున్ బాటి, ఆకాష్ బాటి, అక్షయ్ బాటి, మహేష్, రమేష్, మున్నా లాల్ భాటి, నాగరాజు గుప్త, శ్రావణ్, మనోజ్, రంజిత్ స్థానికులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.




# కృష్ణా పైప్‌లైన్ లీకేజీ కారణంగా హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం

**కృష్ణా ఫేజ్-1లోని పైప్‌లైన్‌లో భారీ లీకేజీ**

**దేవత్‌పల్లి వద్ద 300 ఎంఎం డయా ఎయిర్ వాల్వ్‌లో లీకేజీ**

**సైదాబాద్, శివంరోడ్డు సహా పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం**

**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణానది తాగునీటి సరఫరా ఫేజ్-1లోని పైప్‌లైన్‌లో భారీ లీకేజీ ఏర్పడింది. దీంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఈరోజు అంతరాయం కలుగుతుందని జలమండలి ప్రకటించింది. దేవత్‌పల్లి వద్ద 300 ఎంఎం డయా ఎయిర్ వాల్వ్‌లో ఆకస్మికంగా భారీగా లీకేజీ కనిపించిందని, ఈ కారణంగానే తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. లీకేజీ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఈరోజు మధ్యాహ్నంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ లీకేజీ కారణంగా మిరాలం,

కిషన్ బాగ్, సంతోష్ నగర్, సైదాబాద్, చంచల్‌గూడ, యాకుత్‌పురా, బొగ్గులకుంట, నారాయణగూడ, అడిక్‌మెట్, శివం రోడ్డు, నల్లకుంట, చిలకలగూడ, దిల్‌సుఖ్ నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు పాక్షిక అంతరాయం కలుగుతుందన్నారు.

## టపాసులు పేలి నలుగురికి గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ పాతబస్తీలో బహదూర్ పురా పోలీస్ స్టేషన్ పరిధిలోని కిషన్ బాగ్ లో ఓ ఇంట్లో టపాసులు పేలిపోయాయి. గుట్టుచప్పుడు కాకుండా నిల్వ ఉంచిన టపాసులు పేలడంతో నలుగురు గాయాలు పాలయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారిని స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## పాస్ బుక్ లు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

-గ్రీన్ ఫీల్డ్ ప్లాట్ల యజమానులు

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట పాస్ బుక్ లు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రీన్ ఫీల్డ్ ప్లాట్ల యజమానులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి , జి వి వి ఎస్ మూర్తి, నాగేశ్వరరావు లు మాట్లాడుతూ మల్కాజ్ గిరి జిల్లా ఆల్వాల్ మండలం కానాజిగూడ గ్రామం లలోని 62. 16ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఫీల్డ్ వెంచర్ లో తాము ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు, సదరు భూమిపై వివాదాలు నెలకొనడంతో కొంతమంది కోర్టు కు వెళ్లి ఓ ఆర్ సి తెచ్చుకున్నారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ రద్దు చేయగా దాని సవాల్ చేస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించారని చెప్పారు. చివరకు సుప్రీంకోర్టు సైతం జాయింట్ కలెక్టర్ రద్దు ను సమర్థించిందని అన్నారు. అప్పటి నుండి స్టేటస్ కో లో ఉన్న భూమిని తమకు రెగ్యులరైజ్ కోసం నమోదు చేసుకోగా 2023 లో 385 సర్వే నెంబర్ లో ఐదు ఎకరాల భూమికి అధికారులు పాస్ బుక్ ఇచ్చారని తెలిపారు. ఇక అప్పటి నుండి తమకు వేధింపులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.అక్రమంగా పాస్ బుక్ లు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

## నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** నాచారం పీఎస్ పరిధిలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వెస్ట్ బెంగాల్ కు చెందిన విద్యార్థిని సంజిమా సంవత్సరం కాలంగా నాచారం లోని హాస్టల్ లో ఉంటోంది. బుధవారం సాయంత్రం హాస్టల్ రూం లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేసుకున్న పోలీసులు సంజీమా మృతదేహాన్ని గాంధీకి తరలించారు. సంజిమ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది

# హర్యానా ఎన్నికల్లో బీజేపీ ఎదురీత




**ఛండీఘడ్, సెప్టెంబర్ 19:** హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 18 రోజులే గడువు ఉంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో బరిలో నిలిచేది ఎవరో తేలిపోయింది. దీంతో అన్ని పార్టీలు గెలుపు కోసం ఈ 18 రోజులు సర్వశక్తులు ఒడ్డనున్నాయి. అధికార బీజేపీ మరోమారు గెలవాలని భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల జోష్‌తో కాంగ్రెస్ గెలుపు తమదే అంటోంది. ఇక ప్రాంతీయ పార్టీలు కూడా గెలుపుపై ధీమాతో ఉన్నాయి. ఈసారి ఆప్ కూడా అధికారంలోకి వస్తామంటోంది. ఈ క్రమంలో బీజేపీకి హ్యాట్రిక్ విజయం అంత ఈజీ కాందంటున్నారు విశ్లేషకులు.. ఈ ఎన్నికల్లో జననాయక్ జనతా పార్టీ, ఆజాద్ సమాజ్ పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయి. ఇండియన్ నేషనల్ లోక్‌దల్, బహుజన్ సమాజ్‌పార్టీ, హర్యానా లోఖిత్ పార్టీ కూటమిగా పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, ఆప్ మాత్రం ఒంటరిగా బరిలో దిగాయి.హర్యానా రాష్ట్రం 1966లో ఏర్పడింది. నాటి నుంచి రాష్ట్రంలో మూడు కుటుంబాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. దేవీలాల్, భజన్‌లాల్, బన్సీలాల్ కుటుంబాల చుట్టూ రాజకీయాలు తిరుగుతుంటాయి. ఈ ముగ్గురూ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. దేవీలాల్ 1989 నుంచి 1991 వరకు ఉప ప్రధానిగా కూడా సేవలందించారు. ప్రస్తుతం ఈ ముగ్గురు నేతల వారసులు హర్యానాలో రాజకీయాలు చేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల బరిలో ఉన్నారు. దేవీలాల్ మనుమడు ఆదిత్య దేవీలాల్ ఇండియన్ నేషనల్ లోక్‌దల్ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. మరో మనుమడు దిగ్విజయ్‌సింగ్ చౌతాలా జననాయక్ జనతా పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. దేవీలాల్ కొడుకు రంజిత్ సింగ్ ఇండిపెండెంట్‌గా పోటీలో ఉన్నారు. ఇక భజన్‌లాల్ మనుమడు భవ్య బిష్ణోయ్ బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. బన్సీలాల్ వారసులు అనిరుధ్ చౌదరి కాంగ్రెస్ టికెట్‌పై పోటీలో ఉన్నారు.ఇదిలా ఉంటే.. హర్యానాలో 2014 నుంచి బీజేపీ అధికారంలో ఉంది. ఈసారి కూడా అధికారం నిలబెట్టుకుంటామని నేతలు చెబుతున్నారు. ఈమేరకు ప్రత్యేక ప్రణాళికతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బీజేపీ అగ్రనాయకులు కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాని మోదీ సైతం సుడిగాలి పర్యటన చేస్తున్నారు. అయితే నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. పది స్థానాలు ఉన్న హర్యానాలో బీజేపీ ఐదు, కాంగ్రెస్ ఐదు గెలిచాయి. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా ఉంటుందో అన్న ఆందోళన కమలనాథుల్లో ఉంది. మరోవైపు కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జోష్ ఇచ్చాయి.హర్యాన ఎన్నికల్లో రైతులే అధికార పార్టీని నిర్ణయిస్తారు. అందుకే అన్ని పార్టీలు రైతు ఎజెండాతోనే ముందుకు వెళ్తున్నాయి. అయితే రైతు వ్యతిరేక చట్టాలు, అగ్నిపథ్, నిరుద్యోగ సమస్య ఈసారి ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ గెలుపుపై ప్రభావం చూపుతాయని భావిస్తున్నారు. అయితే బీజేపీ మాత్రం.. గెలుపుపై ధీమాతో ఉంది. పదేళ్ల తాము చేసిన అభివృద్ధి గెలిపిస్తుందని అంచా వేస్తోంది. కాంగ్రెస్ మాత్రం దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రం హర్యానా అని ప్రచారం చేస్తోంది. రైతు ఉద్యమాలు తమకు కలిసి వస్తాయని భావిస్తోంది. మరి హర్యానా ఓటర్లు బీజేపీకి మళ్లీ పట్టం కడతారా.. హస్తం పార్టీని అక్కున చేర్చుకుంటారా అనేది అక్టోబర్ 8న తేలిపోతుంది.

# విలన్ పాత్రలో నాగ్...

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నిన్నటి తరం హీరోలలో టాలీవుడ్ కి నాలుగు స్తంభాలుగా నిల్చిన సూపర్ స్టార్స్ లో ఒకరు అక్కినేని నాగార్జున. నాగేశ్వర రావు నట వారసుడిగా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన నాగార్జున, తన తండ్రిలాగా కాకుండా, తనకి నచ్చిన దారిలో వెళ్తూ, అశేష ప్రేక్షాభిమానం పొంది టాప్ 4 స్టార్ హీరోస్ లో ఒకడిగా నిలిచాడు. ఫ్యామిలీ హీరో గా, క్లాస్ హీరో గా, రొమాంటిక్ హీరో గా, మాస్ హీరో గా, భక్తుడిగా ఇలా ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలలో కనిపించిన నాగార్జున, పూర్తి స్థాయి నెగటివ్ రోల్ లో మాత్రం ఇప్పటి వరకు కనిపించలేదు. రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన 'అంతం' చిత్రం లో నెగటివ్ షేడ్ రోల్ లో కనిపించాడు కానీ, అది పూర్తి స్థాయి కాదు. ఇప్పుడు మొట్టమొదటిసారి ఆయన క్రూరమైన విలన్ గా నటించబోతున్నాడు.సూపర్ స్టార్ రజినీకాంత్, లోకేష్ కనకరాజ్ కాంబినేషన్ లో 'కూలీ' అనే చిత్రం తెరకెక్కుతున్న సంగతి మన అందరికీ తెలిసిందే. ఈ సినిమాకి సంబంధించిన గ్లిమ్స్ వీడియో కూడా ఇప్పటికే విడుదలైంది. ఈ చిత్రం లో నాగార్జున విలన్ రోల్ లో కనిపించనున్నాడు. ఆయన పాత్ర పేరు 'సిమోన్'. నాగార్జున పుట్టినరోజు నాడు ఆ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ని కూడా విడుదల చేసారు మేకర్స్. దీనికి ఫ్యాన్స్ నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ చిత్రంలో నాగార్జున ఒక మంచి పాత్రలో నటిస్తున్నాడని అప్పట్లో అనుకున్నారు కానీ, విలన్ రోల్ లో నటిస్తున్నాడని ఈరోజు సోషల్ మీడియా లో లీక్ అయిన ఒక వీడియో ని చూస్తే అర్థం అయ్యింది. ఈ వీడియోలో పోర్టులో అందరూ పరిగెస్తూ ఉంటారు. తెల్లని సూట్ ధరించిన నాగార్జున సుత్తి తీసుకొని ఒక మనిషిని అతి దారుణంగా ముఖం మీద నాన్ స్టాప్ గా కొట్టి చంపుతాడు. ఒక పవర్ ఫుల్ డైలాగ్ ని కూడా తమిళ్ లో పలుకుతాడు. నాగార్జున ని అంత వయొలెంట్ గా చూసిన ఆయన అభిమానులు ఆశ్చర్యానికి గురి అయ్యారు.చాలా కాలం తర్వాత నాగ్ ని లోకేష్ ఒక పవర్ ఫుల్ రోల్ లో చూపిస్తున్నాడని అర్థం అయ్యింది అంటూ చెప్పుకొస్తున్నారు. విక్రమ్ సినిమాలో హీరో సూర్య క్లైమాక్స్ లో ఎంట్రీ ఇచ్చి అతి క్రూరంగా తన సహచరులను చంపడం మనం చూసాము. ఈ సినిమాలో ఆయన కనిపించింది కేవలం 5 నిమిషాలే అయినప్పటికీ, ఇండియా మొత్తం ఆ క్యారక్టర్ ద్వారా రీ సౌండ్ వచ్చేలా చేసాడు. ఈరోజు కూలీ చిత్రంలో నాగార్జున క్యారక్టర్ ని చూస్తే అంతకంటే క్రూరంగా అనిపించింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజెన్స్. అయితే ఇన్ని రోజులు హీరో రోల్స్ లో మాత్రమే చూసి నాగార్జునని ఆరాధించిన తెలుగు ప్రేక్షకులు, ఇప్పుడు ఈ నెగటివ్ రోల్ లో ఆయన్ని చూడగలరా లేదా అనేది చూడాలి.


# స్టాలిన్ కు వారసత్వం... డిప్యూటీ సీఎం పదవి

**న్యూస్‌డెస్క్ పెన్‌పవర్ చెన్నై, సెప్టెంబర్ 19:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎం కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడు తన అనంతరం వారసుడు ఎవరు అన్నదీ పెద్ద ఎత్తున చర్చ నడిచింది. చర్చ అనడం కన్నా అదో పెద్ద వివాదం అని చెప్పొచ్చు. అప్పటికే డీఎంకె యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్న స్టాలిన్ తన వారసుడు అంటూ కరుణానిధి స్వయంగా ప్రకటించారు పెద్ద కుమారుడైన అళగిరి కరుణానిధి వారసత్వం కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే వారసుడిగా తన అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వ్యూహాత్మకంగా 2009 లోక్ సభ ఎన్నికల అనంతరం డిప్యూటీ సీఎంగా స్టాలిన్‌ను ఎంపిక చేశారు. ఆ సమయంలో కరుణానిధి ఆరోగ్యం కూడా పూర్తిగా సహకరించకపోవడం అటు పార్టీ ఇటు ప్రభుత్వం రెండు విధాలుగా చేదోడు వాదోడుగా ఉంటాడన్న వ్యూహంతో ఆరోజు కరుణానిధి ఆ నిర్ణయం తీసుకున్నారు. కరుణానిధి మరణానంతరం స్టాలిన్‌కు పార్టీ పగ్గాలు చేజిక్కించుకునేందుకు సీఎం అయ్యేందుకు ఆరోజు కరుణానిధి నిర్ణయం ఎంతగానో దోహదపడింది. ప్రస్తుతం ఎంకే స్టాలిన్ కూడా అదే ఆలోచనతో తన కుమారుడు



ఉదయనిధి స్టాలిన్ కు వారసత్వం దక్కాలన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మంత్రివర్గంలో చోటు కల్పించిన స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ ను డిప్యూటీ సీఎం చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర యువజన సంక్షేమ క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న స్టాలిన్ ఆరోగ్యపరంగా కూడా చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించాలంటే మంత్రిగా కంటే ఉపముఖ్యమంత్రిగా ఉండడం మంచిదన్న ఆలోచనతో స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది 2026 లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కూడా డీఎంకేకు ప్రతిష్టాత్మకం కానున్నాయి. తమిళనాడులో డీఎంకే ఏఐడిఎంకె ప్రధాన పార్టీలుగా ఉండగా, వచ్చే ఎన్నికల్లో ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన పార్టీ కూడా బరిలో ఉండబోతోంది. దీంతో పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే స్టాలిన్ తోపాటు తన అనుకున్న ముఖ్యమైన వారు పార్టీ బాధ్యతలను షేర్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసమే వీలైనంత త్వరగా డిప్యూటీ సీఎం చేయడం, ఇటు పార్టీకి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు సులువుగా ఉంటుందని స్టాలిన్ ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు గతంలో తండ్రి కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే డిప్యూటీ సీఎం అయ్యాక పార్టీలో స్టాలిన్ మంచి పట్టు సాధించగలిగారు. ఇప్పుడు తన కుమారుడు ఉదయినిధి స్టాలిన్ కు కూడా అదే ఫార్ములా ఉపయోగపడుతుందని గట్టిగా భావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. నేడో రేపో ఈ ప్రకటన అధికారికంగా రానుంది. మరోవైపు సీఎం స్టాలిన్ తాజాగా అమెరికా పర్యటన తర్వాత హడావిడిగా తీసుకున్న నిర్ణయంగా తెలుస్తోంది. స్టాలన్ ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్న వార్తలు వస్తున్నాయి. దీంతో ఉదయనిధి స్టాలిన్ ను పార్టీలో స్ట్రాంగ్ చేయాలన్న వ్యూహమూ ఉంది. స్టాలిన్ ఆరోగ్యం సరిగా లేని కారణంగా నిర్ణయం అనివార్యంగానూ చెబుతున్నారు.

# చంద్రయాన్ 4లో ఏం చేస్తారంటే...



**న్యూస్ డెస్క్ పెన్‌పవర్ బెంగళూరు/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:** చంద్రయాన్ 4 మిషన్ ద్వారా చంద్రుడి సౌత్ పోల్ మీద నుంచి శాంపిల్స్ సేకరించి భారత్ కు తీసుకురావడం, చందమామ నుంచి చంద్రయాన్ 3 నుంచి అవసరమైన టెక్నాలజీని సైతం తిరిగి తేవాలని కేంద్ర భావిస్తోంది. చంద్రుడి మీదకి వెళ్లడంతో పాటు అక్కడి నుంచి భూమికి తిరిగొచ్చేలా టెక్నాలజీని చంద్రయాన్ 4లో అభివృద్ధి చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ చంద్రయాన్–4 ద్వారా 2040 నాటికి చంద్రునిపై ల్యాండింగ్ కావడంతో పాటు అక్కడి నుంచి శాంపిల్స్ సేకరించి, రక్షితంగా తిరిగి భూమికి తిరిగి రావడం టార్గెట్. 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసేందుకు కేబినెట్ లో చర్చ జరగింది. దాంతో పాటు చంద్రయాన్ 4 మిషన్ ద్వారా 2040 నాటికి చంద్రునిపై ల్యాండింగ్ అయి, అక్కడినుంచి భూమి మీదకి సురక్షితంగా ల్యాండింగ్ కావాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. చంద్రయాన్–3 ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై దక్షిణ ధృవంపై సురక్షింగా ల్యాండింగ్ అయింది. కొన్ని రోజులపాటు మనకు సిగ్నల్స్ పంపినట్లు ఇస్రో సైంటిస్టులు తెలిపారు. కానీ కొన్నిరోజులకు అక్కడ సూర్యుడు లేకపోవడంతో ల్యాండర్ పనిచేయడం ఆగిపోవడంతో మిషన్ అక్కడితో ఆగిపోయింది.

తాజాగా చంద్రయాన్ 4 ద్వారా గత మిషన్ లో చేసిన ప్రయోగాలకు కొనసాగింపుగా.. చంద్రుడి మీద ల్యాండ్ అయి అక్కడి నుంచి ప్రయోగాలకు అవసరమైన శాంపిల్స్ తిరిగి తీసుకువచ్చి సత్తా చాటాలని కేంద్ర మంత్రివర్గం భావిస్తోంది. అంతరిక్ష వాహక నౌకనుఅభివృద్ధి సహా ప్రయోగం బాధ్యతలను ఇస్రో తీసుకుంది. ప్రస్తుతం ఇస్రోలోని పద్ధతుల ద్వారా ప్రాజెక్ట్ సమర్థవంతంగా నిర్వహించాలని, పనులను సైతం ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తారు. ఆమోదం పొందిన 36 నెలల్లో మిషన్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు పడతాయని కేబినెట్ స్పష్టం చేసింది. స్వదేశీ టెక్నాలజీతో చంద్రయాన్ 4 మిషన్ ను రూపొందించి సక్సెస్ చేయాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా ఎన్నో రంగాల వారికి దీని వల్ల ఉపాధి దొరకడంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థకు సైతం దోహదపడుతుందని ప్లాన్ చేశారు.

**చంద్రయాన్ 4 ఖర్చు..**

చంద్రయాన్–4 మిషన్ కోసం మొత్తం నిధుల రూ. 2104.06 కోట్ల మేర అవసరం. కాగా, చంద్రయాన్ 4 మిషన్ లాంచింగ్ వెహికల్, ఎల్వీఎం 3 రెండు ప్రయోగ వాహకనౌకల మిషన్లు, స్పెస్ నెట్‌వర్క్ సహకారం, ప్రయోగానికి ముందు చేసే పరీక్షలకు ఖర్చు అవుతుంది. వీటితోపాటు చంద్రుని ఉపరితలంపై చంద్రయాన్ 4 ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ అయి, అక్కడ మనకు కావాల్సిన శాంపిల్స్ సేకరించి భూమికి సురక్షితంగా తిరిగి రావడం మిషన్ ఉద్దేశం. ఈ మిషన్ ద్వారా చంద్రుడి మీదకు మనుషులను పంపి అధ్యయనం కోసం శాంపిల్స్ సేకరించే అవకాశం ఉంది.

# గంజాయి మత్తులో యువకుల వీరంగం




**హైదరాబాద్ పెన్ పవర్:**కొండాపూర్ లోని హిందూ జై గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులపై దాడి జరిగింది. బుధవారం రాత్రి గణేష్ మండపం వద్ద మద్యం,గంజాయి సేవించి మత్తులో కత్తులు,కర్రలతో వీరంగం సృష్టించారు. దాడికి పాల్పడ్డ వారు బంజారాహిల్స్ కు చెందిన చందు ఫైల్వాన్,రణదీప్ గా గుర్తించారు. ఘటనలో పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని స్థానిక ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఇంట విషాదం

**హైదరాబాద్ పెన్ పవర్:**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సోదరి మృతి చెందారు. శ్రీ గణేష్ సోదరి విజయ కుమారి. కారులో వస్తుండగా ఒక్క సారిగా గుండె పోటు కు గురైయారు. ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు.

## గణేష్ నిమజ్జనం కు వెళ్తున్న భక్తులపై బీఆర్ఎస్ నేత అనుచరుల దాడి

**సరూర్ నగర్ చెరుకు తోట కాలనీ కి చెందిన దళితుల ఆందోళన**



**హైదరాబాద్ పెన్ పవర్:**బుధవారం రాత్రి గణేష్ నిమజ్జనం సందర్భంగా వినాయక నిమజ్జనం చేయడానికి వెళ్తున్న భక్తులపై మన్సురా బాధ్ డివిజన్ బీఆర్ఎసక్ నేత జక్కిడి రఘువీర్ రెడ్డి, అతని అనుచరులు దాడికి పాల్పడ్డారు . ఈ దాడిలో స్వరూప రాణి అనే మహిళకు గాయాలయ్యాయి. మహిళలు అని కుడా చూడకుండా భౌతిక దాడులకు దిగడం జరిగిందని, తక్షణమే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర మాల మహానాడు నేత బేర బాలకిషన్ ఆధ్వర్యంలో సరూర్ నగర్ పోలీసు స్టేషన్ లో బైఠాయించారు.

# జగ్గారెడ్డి...ఎంత ఘాటు ప్రేమయో...



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ మెదక్, సెప్టెంబర్ 19:** జగ్గారెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో ఆయనో సంచలనం. నిత్యం ప్రెస్‌మీట్లు పెట్టి ఏదో ఒక సంచలన వ్యాఖ్యలు చేస్తూ చర్చల్లోకి వస్తుంటారు. అదే విధంగా వివాదాస్పద వ్యాఖ్యలకు కూడా ఆయన కేరాఫ్ అని కూడా తెలుసు. అలాగే.. ప్రతిపక్షాలకు గట్టి కౌంటర్ ఇవ్వడంలో.. వారికి వార్నింగ్ ఇవ్వడంలోనూ ఏమాత్రం తగ్గరు. అలాంటి జగ్గారెడ్డి మరోసారి వార్తల్లోకెక్కారు. కేటీఆర్ వ్యాఖ్యలపై ఆయన స్పందించిన తీరు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.వాస్తవానికి రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ.. అంతకుముందు రేవంత్ రెడ్డితో ఆయనకు పెద్దగా సఖ్యత ఉండేది కాదు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి.. ఆయనకు పీసీసీ చీఫ్ పదవి అప్పజెప్పినప్పటి నుంచే ఆయనను విమర్శిస్తూనే ఉండేవారు. అయితే కొన్ని సందర్భాల్లో అది బహిరంగంగానే తేటతెల్లమైంది. కొత్తగా వచ్చిన వారికి పీసీసీ పదవి ఇవ్వడంపైనా ఆయన అప్పట్లో విమర్శలు చేశారు. ఒకానొక సందర్భంలో రేవంత్ రెడ్డి కూడా ఆయనతో సమావేశమై మద్దతు కోరిన సందర్భాలు ఉన్నాయి.అయితే.. ఇప్పుడు సీన్ అంతా రివర్స్ అయింది. ఏకంగా రేవంత్ రెడ్డికి మద్దతుగా వ్యాఖ్యలు చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో గత నాలుగు రోజులుగా అరికెపూడి గాంధీ, కౌశిక్ వివాదం నడుస్తోంది. ఈ వివాదం ఇప్పటికే రాజకీయంగా ప్రకంపనలు రేపింది. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన కేటీఆర్ నిన్న హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన వచ్చి రాగానే కౌశిక్ రెడ్డిని పరామర్శించి అక్కడే మీడియాతో మాట్లాడారు.కౌశిక్ రెడ్డిపై దాడి వెనుకాల సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. ఆయన కనుసన్నల్లోనే ఈ దాడి జరిగిందన్నారు. ఇదంతా సీఎం కుట్ర అంటూ మాట్లాడారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాలేదనే అక్కసుతోనే హైదరాబాద్ బ్రాండ్ ఈమేజీని దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. అయితే.. కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. కేటీఆర్‌కు ఆయన స్టైల్‌లో మాస్ వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి జోలికొస్తే నాలుక కోస్తామంటూ హెచ్చరించారు. గాంధీ కౌశిక్ రెడ్డిల వివాదం బీఆర్ఎస్ పార్టీకి చెందినదని.. ఈ విషయంతో రేవంత్ రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా.. రేవంత్ ను విమర్శిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని అన్నారు. అధికారం కోల్పోయి కేటీఆర్ ఫ్రస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతలపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పదేళ్ల అధికారంలో కొనసాగి.. ఇప్పుడు మరోసారి ప్రాంతీయతను రెచ్చగొడుతున్నారని అన్నారు. అయితే.. జగ్గారెడ్డి వ్యాఖ్యలపై పలు ట్రోల్స్ నడుస్తున్నాయి. రేవంత్ రెడ్డి సీఎం కాకముందు ఒకలా వ్యవహరించి.. సీఎం కాగానే తీపి అయ్యాడా అనే కోణంలో విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఢిల్లీ సీఎంకు చిత్తూరుతో లింక్...

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ చిత్తరు, సెప్టెంబర్ 19:** ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. ఆ తరవాత ఎవరు ఆ కుర్చీలో కూర్చుంటారు..? అని అంతా ఆసక్తిగా ఎదురు చూశారు. ఎవరూ ఊహించని విధంగా అతిషి పేరు తెరపైకి వచ్చింది.ఒకటి, రెండు రోజుల్లో ఆమె ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ సందర్భంగా ఆమె పొలిటికల్ జర్నీకి సంబంధించిన టాప్ పాయింట్స్

పాయింట్ నంబర్ 1: 2013లో ఆప్‌లో చేరారు అతిషి. విద్యాశాఖలో అడ్వైజర్‌గా తన జర్నీని మొదలు పెట్టిన ఆమె 2020 ఎలక్షన్స్‌లో ఎమ్మెల్యేగా ఎన్నికై...ఓ ఏడాది క్రితం మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. మంత్రి అయిన ఏడాదిలోనే సీఎం కూడా అవుతున్నారు.

పాయింట్ నంబర్ 2: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో హిస్టరీలో పీజీ చేశారు అతిషి. ప్రపంచంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన రోడ్స్ స్కాలర్‌షిప్‌ని



పొందారు. ఏపీలోని మదనపల్లెలో జిడ్డు కృష్ణ మూర్తి స్థాపించిన రిషి వ్యాలీ ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లీష్, హిస్టరీ సబ్జెక్ట్ టీచ్ చేశారు.


పాయింట్ నంబర్ 3: ఢిల్లీ చరిత్రలో మూడో మహిళా ముఖ్యమంత్రిగా రికార్డు సాధించనున్నారు అతిశి. అంతే కాదు. ప్రస్తుతం భారత్‌లో యంగెస్ట్ చీఫ్ మినిస్టర్‌గానూ చరిత్ర సృష్టించారు.

పాయింట్ నంబర్ 4: అతిషి ఫ్యామిలీది లెఫ్టిస్ట్ భావజాలం. తల్లిదండ్రులు ఆమె పేరులో మార్క్స్, లెనిన్ పేర్లు వచ్చేలా అతిషి మర్లేనా అని పెట్టారు. అయితే..2019 ఎన్నికల సమయంలో తన ఇంటి పేరుని తొలగించుకున్నారు. ఇకపై అతిషిగానే పిలవాలని ప్రకటించారు.

పాయింట్ నంబర్ 5: అతిషి కొన్ని కాంట్రవర్సీల్లో కూడా చిక్కుకున్నారు. రౌడీలకైనా ఓటు వేయండి కానీ బీజేపీ వాళ్లకు ఓటు వేయొద్దని అప్పట్లో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. అతిషి తల్లిదండ్రులు టెర్రరిస్ట్ అఫ్జల్ గురుని ఉరి తీయొద్దని పదేపదే పిటిషన్‌లు వేశారని..ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఇది కూడా కాంట్రవర్సీ అవుతోంది.

# ప్రేక్షక పాత్రలో గులాబీ పార్టీ

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 19:** తెలంగాణ రాజకీయాల్లో ఏం జరుగుతోంది? అధికార పార్టీని బీఆర్ఎస్ ఎదుర్కోలేక పోతుందా? బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర పోషించలేకపోతుందా? కేడర్‌తోపాటు నేతలూ డీలా పడుతున్నారా? బోలెడు సమస్యలతో సతమతమవుతున్న పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతుందా? ప్రజా సమస్యలను పక్కన పెట్టేసిందా? అవుననే సంకేతాలు కొన్ని వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది.గడిచిన పదేళ్లు బీఆర్ఎస్‌కు స్వర్ణయుగం. కొత్తగా రాష్ట్రం ఏర్పడటం, ఆ తర్వాత అధికారంలోకి రావడం జరిగింది. పదేళ్ల తర్వాత తొలిసారి ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. అపోజిషన్ అంటే.. అధికార పార్టీని నిలదీయడానికి సరైన అవకాశం ఉంటుంది. కానీ, ఆ పాత్రకు కారు పార్టీ దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. అధికార పార్టీ ఎత్తులను పసిగట్ట లేకపోతోంది. ప్రతీరోజూ ఆ పార్టీ నేతలు మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నా.. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేకపోతోంది. ఎమ్మెల్యేలు మాత్రమే కాదు, చివరకు ఆ పార్టీలోని కీలక నేతలు సైతం ఇదే విధంగా వ్యవహరిస్తున్నట్లు కొన్నివర్గాల ప్రజలు బలంగా నమ్ముతున్నారు.ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతీ కార్యక్రమం సరిగా జరుగుతుందా, లేదా అన్నదానిపై ఏ మాత్రం ఫోకస్ పెట్టలేదు. కొద్ది రోజులుగా కారు పార్టీలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు ఉదాహరణ. కారులో శాశ్వతంగా షెడ్‌కి వెళ్లిందని, ఇక రాదని ఒకానొక సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బహుశా అదే కంటిన్యూ అవుతున్నట్లు కనిపిస్తోంది. అధికార పార్టీ లేవనెత్తిన ప్రతీ అంశాన్ని బురద జల్లడం చేసే ప్రయత్నంలో నిగమ్నమైంది. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన కనిపించలేదు. మా పథకాలను తొలగించారంటూ చీటికి మాటికీ చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది.మొన్నటికి మొన్న రైతుల రుణమాఫీ గురించి విపక్ష నేతల ఆరోపణలు కేవలం మీడియాకే పరిమితమయ్యాయి. ఆ తర్వాత ఆ విషయాన్ని సైడున పెట్టేసింది కారు పార్టీ. ఈలోగా గులాబీ పార్టీలో అంతర్గత కలహాలు మొదలయ్యాయి. దాని దెబ్బకు కారు రెండు ముక్కలైంది. ఆ వ్యవహారాన్ని డైవర్ట్ చేసేందుకు హైదరాబాద్‌లో శాంతి భద్రతల వ్యవహారాన్ని ప్రస్తావించి ప్రజల్లో ఆ పార్టీ మరింత చులనైపోయింది.



సెక్రటేరియేట్‌లో సీఎం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఆ క్రమంలో అధికార విపక్షాల మధ్య మాటలయుద్ధం సాగింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నోరు ఎత్తారు. తాము అధికారంలోకి వస్తే రాజీవ్ విగ్రహాన్ని తొలగిస్తామంటూ కేడర్‌ను ఉత్తేజపరిచే మాటలు తప్పితే, సరిగా ప్రతిపక్ష పాత్ర పోషించలేదన్నది కొందరి వాదన.రాజు బలహీనపడితే.. సామంత రాజులు రెచ్చిపోతారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో అదే జరుగుతోందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఆ పార్టీకున్న 38 మంది ఎమ్మెల్యేలు.. ఇప్పటికే కొందరు మిగతా పార్టీ నేతలతో టచ్‌లో ఉన్నారు. పైగా నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనికి తోడు అరికెపూడి గాంధీ-కౌశిక్‌రెడ్డి వ్యవహారం ఆ పార్టీలో ముసలం రేపింది. గట్టిగా మాట్లాడే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు సైతం నోరు మెదపలేదని పరిస్థితి నెలకొంది. గట్టిగా మాట్లాడితే తమ కుర్చీ కిందకు నీళ్లు వస్తాయని భావిస్తున్నారు.కొద్ది రోజులుగా ఏ ఒక్కరూ ఎమ్మెల్యేలు బయటకు వచ్చి ప్రజా సమస్యల గురించి మాట్లాడిన సందర్భం లేదు. ఆ పార్టీ వ్యవహారాలకు నేతలు దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. బీఆర్ఎస్.. పేరుకే జాతీయ పార్టీ.. కనీసం ప్రాంతీయ పార్టీ మాదిరిగా వ్యవహరించ లేదన్నది కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నమాట. రాబోయే రోజుల్లో ఆ పార్టీలో ఇంకెన్ని పరిణామాలు చోటు చేసుకుంటాయో చూడాలి.

# భయపెడుతున్న పులులు

స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ నిజామాబాద్, సెప్టెంబర్ 19: మూడు పులుల సంచారం అటు తెలంగాణ ప్రజలతో పాటు ఇటు మహారాష్ట్ర వాసులను వణికిస్తోంది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో పులులు సంచరిస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌అవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పెన్ గంగానది పరిసర ప్రాంతాల్లో మూడు పులులు కనిపించాయి. తెలంగాణ సరిహద్దుకు కూతవేటు దూరంలో ఉన్న మహారాష్ట్ర సరిహద్దులోని రాంనగర్–సావర్గాం మార్గంలో మూడు పులులు ఓ ద్విచక్ర వాహనదారుడికి కనిపించాయి. పులుల సంచార చిత్రాలను తన సెల్ ఫోన్ లో ఫోటోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో మొత్తం సోషల్ మీడియాలో అవి వైరల్ గా మారాయి.మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం పెన్ గంగానది సరిహద్దులో తెలంగాణలోని ఆయా గ్రామాలకు అతి సమీపంలో ఉండటంతో తరచూ పులులు కనిపించడం... చలికాలంలో.. వేసవిలో పెన్ గంగానది దాటి భీంపూర్ మండల వైపు సంచరించడం సర్వసాధారణంగా మారింది. గత రెండేళ్లుగా పులులు వస్తూ.. పోతూనే ఉన్నాయి. రెండేళ్ల కిందట నాలుగు పులులు.. ఓ తల్లి, దాని మూడు పిల్లలు భీంపూర్ మండలంలోని తాంసి(కె) గొల్లఘాట్, పిప్పల్ కోటి శివారులో సంచరించి ఆవాసం ఏర్పర్చుకున్నాయి. అప్పుడు పదుల సంఖ్యలో పశువులపై దాడులు చేసి హతమార్చాయి.

మూడు నెలల తరువాత అవీ మళ్లీ యధావిధిగా తిప్పేశ్వర్ అభయారణ్యానికి వెళ్లిపోయాయి. గత ఏడాది సైతం రెండు పులులు అలాగే సంచరించి పలు పశువులను హతమర్చాయి. మళ్లీ యధావిధిగా అవి తిప్పేశ్వర్ అభయారణ్యానికి వెళ్ళిపోయాయి. భీంపూర్ మండలంలోని తాంసి (కె) గొల్లఘాట్ తర్వాత తెలంగాణ సరిహద్దులోని గ్రామాలకు పెన్ గంగానదిని ఆనుకునే తిప్పేశ్వర్ అభయారణ్యం ఉండడంతో పులుల రాక సర్వసాధారణమే అవుతోంది. వాటికి ఇక్కడ ఏపుగా ఎత్తైన మహావీర మొక్కల మధ్య మంచి ఆవాసం ఉంటుంది. చలికాలంలో ఆడ,మగ పులులు కలయిక కోసం వెతుక్కుంటూ సైతం ఈ ప్రాంతానికి వస్తుంటాయి. రెండేళ్ల క్రితం ఓ తల్లి మూడు పిల్లలు మొత్తం నాలుగు పులులు భీంపూర్ మండల శివారులోకి వచ్చి ఈ ప్రాంతంలో ఏపుగా ఎత్తుగా ఉన్న మహావీర మొక్కల మధ్య ఆవాసం ఏర్పరచుకొని, పులి పిల్లలకు తల్లి పులి వేటాడడం నేర్పించి తిరిగి అవి యధావిధిగా తిప్పేశ్వర్ అభయారణ్యానికి వెళ్లిపోయాయి. ఈ ప్రాంతము అంతా బఫర్ జోన్ ఏరియాలో ఉంది. ఇక్కడ దట్టమైన అటవీ అంతగా ఏమీ లేదు, కానీ.. పెన్ గంగానది సరిహద్దులో ఉండడం వల్ల వాటికి ఏపుగా పెరిగే మహావీర మొక్కలు ఈ బఫర్ జోన్ లో ఉండడం వల్ల ఇక్కడికి వాటి రాక తరచు కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతానికి వాట్సాప్ లో వైరల్ అవుతున్న ఈ పులుల ఫోటోలను చూసి సరిహద్దు గ్రామాల ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు మాత్రం ఇంకా తెలంగాణ ప్రాంతంలోకి పులులు సంచరించలేదని, అవి పెన్ గంగానది అవతలి వైపే ఉన్నాయని, ఎంతకైనా సరే సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సైతం సూచిస్తున్నారు.

# రెచ్చిపోతున్న వడ్డీ వ్యాపారులు

స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 19: హైదరాబాద్ మహానగరంలో అవినీతి, నేరాలకు హద్దు అదుపు లేకుండా పోతోంది. అక్రమ రీతిలో సంపాదనలు, అరాచకాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. పాతబస్తీలో ఫైనాన్సర్ వేధింపులు తాళలేక ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకుని చనిపోయిన గతంలో ఎన్నో చోటు చేసుకున్నాయి. తాజాగా పాతబస్తీలోని బహదూర్ పురా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ ఘటన ప్రస్తుతం ఏకంగా పోలీస్ వ్యవస్థకే ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.పాతబస్తీలో వడ్డీ వ్యాపారాలు రెచ్చిపోతున్నారు. మొన్నటివరకు ప్రశాంతంగా ఉన్న వడ్డీ వ్యాపారులు తాజాగా మరోసారి వేధింపులతో తెరపైకి వస్తున్నారు. అవసరాల నిమిత్తం అప్పు కోసం వచ్చిన వారి నుంచి అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తూ పేదల నడ్డి విరుస్తున్నారు. అప్పు చెల్లించడంలో ఆలస్యమైతే దాడులకు దిగుతున్నారు. ఇలా అవసరం నిమిత్తం రౌడీషీటర్లు, పహిల్వాన్ల వద్ద అప్పు తీసుకుని జీవితాంతం చక్రవడ్డీ కడుతూనే ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి. రౌడీ షీటర్ల వేధింపులు తాళలేక ఎందరో మహిళలు తమ పరువుని కూడా తాకట్టు పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో అయితే వడ్డీ కట్టలేదని ఏకంగా మహిళలని తీసుకెళ్లిపోయినా దౌర్భాగ్య పరిస్థితులు కూడా పాతబస్తీలో జరిగాయి. హైదరాబాద్ నగరంలో వడ్డీ వ్యాపారస్తులు అందరూ ఒక పద్ధతిని అనుసరిస్తారు. అవసరంలో ఉండి తమ వద్దకు వచ్చినవారికి డబ్బులు అప్పుగా ఇచ్చి రూ.2 నుంచి రూ.4.. లేదా కొందరు ఏకంగా రూ.10 వడ్డీ వసూలు చేస్తుంటారు. తాజా ఇలాంటి ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది.పాతబస్తీలో నివసించే రహ్మతుల్లా అనే వ్యక్తి వడ్డీ వ్యాపారుల వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు గాను ప్రతి 15 రోజులకు ఒకసారి 50 వేలు తిరిగి చెల్లించేలా.. ఈ లెక్కన మూడు నెలల్లో పూర్తి డబ్బును చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. ఇదే పద్దతిని అనుసరిస్తూ తాను సమయానికి డబ్బు కూడా చెల్లిస్తున్నట్లుగా కూడా బాధితుడు చెప్పుకొచ్చాడు. కానీ, డబ్బులు ఇచ్చిన వడ్డీ వ్యాపారులు ఇప్పుడు మాట మారుస్తున్నారని, మరో మూడు నెలలు ఇదే విధంగా రూ.50 వేలు చెల్లించాలని, ఒప్పుకొని పక్షంలో తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను 5 గంటలకు ఇంటి నుంచి తీసుకెళ్లి 9.50 వరకు చిత్రహింసలు పెట్టారని వాపోయాడు.అనంతరం తన అన్నను కూడా ఆ ఘటన స్థలానికి రప్పించి మాట్లాడారని తెలిపాడు. ఇష్టం వచ్చిన రీతిలో తమపై దాడికి పాల్పడ్డారని, తన కుటుంబ సభ్యులను కూడా చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపాడు. తన చేతులు, ముక్కు, తల భాగంలో తీవ్రంగా కొట్టారని.. పెదవి చిట్లి రక్తం వచ్చేలా తీవ్రంగా దాడి చేశారని చెప్పుకొచ్చాడు. ఈ ఘటనతో తాను తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నానని, తాను మిగతా వేరే సమస్యలతో కూడా సతమతం అవుతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు.ఇదే విషయమై బహదూర్ పురా పోలీసులకు ఫిర్యాదు చేశానని.. ఎలాగైనా ఈ సమస్య నుంచి తనను బయటపడేసి పోలీసులే తనకు సరైన న్యాయం చేయాలని వేడుకున్నాడు

## ప్రాంతీయ పార్టీలకే తొలి దెబ్బ...



స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 19: తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ ఐదేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందుకే పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి 2020లో పార్టీ పగ్గాలను బండి సంజయ్‌కు అప్పగించింది. మాటలతో మాయ చేసే కేసీఆర్‌కు చెక్ పెట్టేది బండి సంజయ్ మాత్రమే అని అధిష్టానం భావించి.. అధ్యక్షుడిగా నియమించింది. తనకు అప్పగించిన బాధ్యతను నూటికి నూరు శాతం నెరవేర్చారు బండి సంజయ్. హైదరాబాద్‌లో మాత్రమే కనిపించే బీజేపీని పల్లె పల్లెకూ తీసుకెళ్లారు. ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో.. పార్టీకి గతంలో ఎన్నడూ లేనంత మైలేజీ తెచ్చారు. పార్టీకి వచ్చిన ఊపుతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని అంతా భావించారు. కనీసం రెండో స్థానంలో అయినా నిలుస్తుందని అంచనా వేశారు. కానీ, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధిష్టానం అనూహ్యంగా బండి సంజయ్‌ను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. అప్పటి వరకు ఉత్సాహం ఉరకలెత్తిన పార్టీలో నైరాశ్యం నెలకొంది. క్యాడర్ డీలా పడింది. దాని ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. కేవలం 8 స్థానాలతో మూడో స్థానానికే పరిమితమైంది.మూడేళ్లు బండి సంజయ్ కష్టపడి పార్టీని తెలంగాణలో అధికార బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా చేశారు. ఒక దశలో బీజేపీ ఎక్కడుంది అన్న కేసీఆర్.. బీజేపీ పేరు ఎత్తకుండా ఉండలేని పరిస్థితి తెచ్చారు. ఇక కేంద్రంలో కేసీఆర్ కూడా గిచ్చి కయ్యం పెట్టుకున్నారు. ప్రధాని పదవిపై ఆశతో, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలన్న ఆలోచనతో రాష్ట్రంలో పార్టీని గాలికి వదిలేశారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. అప్పటికే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న పార్టీ.. పేరు మార్పుతో మరింత డీలా పడింది. అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ డీలా పడడంతో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకుంది. పొరుగున ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ గెలవడంతో అదే ప్రభావం తెలంగాణ ఎన్నికల్లో కనిపించింది. దీంతో జాతీయ పార్టీ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది.ఇక అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నాయకులు పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు బీఆర్ఎస్‌కు చెక్ పెట్టేందుకు బీజేపీ కూడా పెద్ద ఎత్తుగడ వేసింది. 2029లో జమిలి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈమేరకు రామ్‌నాథ్‌కోవింద్ కమిటీ నివేదికకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టే అవకాశం కనిపిస్తోంది.జమిలి ఎన్నికల విధానం అమలులోకి వస్తే.. పార్లమెంట్, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఎన్నికల్లో జాతీయ పార్టీల ప్రభావమే ఎక్కువగా ఉంటుందని బీజేపీ భావిస్తోంది. దీంతో ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ పెద్దగా ప్రభావం చూపదని అంచనా వేస్తోంది. దీంతో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుందని లెక్కలు వేస్తోంది. జమిలి ఎన్నికలతో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, ఆలా కాకపోయినా రెండో స్థానంలో నిలుస్తుందని అంచనా కమలం నేతలు అంచనా వేస్తున్నారు.

# ఢిల్లీ తర్వాత తెలంగాణానే...

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 19:**
మైకు దొరికితే చాలు బంగారు తెలంగాణ అని చెప్పేవాడు. బంగారు తెలంగాణ దిశగా తాము కృషి చేశామని పదేపదే చెప్పుకునేవాడు. తొలి ఐదేళ్లు, ఆ తర్వాత ఐదేళ్లు కూడా బంగారు తెలంగాణ అనే నినాదాలు కేసీఆర్ వదిలిపెట్టలేదు. ఆయన చుట్టూ ఉన్నవాళ్లు విడిచిపెట్టలేదు. ఇక నమస్తే తెలంగాణ సంగతైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పోతురాజు లాగా చర్నాకోల్ పట్టుకొని కొట్టుకునేది.. అప్పట్లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నుంచి మొదలు పెడితే భారతీయ జనతా పార్టీ వరకు అందరు నాయకుల విమర్శించేవారు. సరిగ్గా జీతాలు కూడా ఇవ్వడం లేదు, అప్పులు లేకుండా పాలన సాగడం లేదు, కాళేశ్వరం కట్టి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశాడని కెసిఆర్ మీద విపక్ష పార్టీలు విమర్శలు చేసేవి. అవి ఎలా ఉన్నప్పటికీ కెసిఆర్ అండ్ కో బంగారు తెలంగాణ ప్రచారాన్ని వదిలిపెట్టేది కాదు. దానికి రాష్ట్రమని ట్యాగ్ లైన్ ను విడిచిపెట్టేది కాదు. అయితే అప్పట్లో కెసిఆర్ అన్న మాటలను చాలామంది వక్రీకరించేవారు. కానీ ఇన్నాళ్లకు కేసీఆర్ చెప్పిన మాటలు నిజమయ్యాయి . ఆయన అధికారంలో లేకపోయినప్పటికీ తెలంగాణ ధనిక రాష్ట్రమని తేలిపోయింది. మనదేశంలో రాష్ట్రాలు, వాటి ఆర్థిక




పరిస్థితులపై కేంద్రం ఒక నివేదిక విడుదల చేసింది. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి దీనిని వెల్లడించింది. దాని ప్రకారం దేశ రాజధాని ఢిల్లీ, పది సంవత్సరాల క్రితం ఏర్పడిన తెలంగాణ, కర్ణాటక, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలు దేశంలో తొలి 5 ధనిక రాష్ట్రాలుగా నిలిచాయి. ఇక బీహార్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, మణిపూర్, అస్సాం తొలి అయిదు పేద రాష్ట్రాలుగా ఉన్నాయి. అయితే ధనిక రాష్ట్రాల జాబితాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లేకపోవడం ఇక్కడ విశేషం. గుజరాత్ రాష్ట్రం నుంచి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ, హోం మంత్రిగా అమిత్ షా కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతటి హేమా హేమీ ఇలాంటి నాయకులు ఉన్నప్పటికీ.. నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని చెప్పిన గుజరాత్ రాష్ట్రం ధనిక రాష్ట్రాల జాబితాలో లేకపోవడం విశేషం. కేంద్రం నివేదిక ప్రకటించడమే ఆలస్యం భారత రాష్ట్ర సమితి ప్రచారం చేసుకోవడం మొదలుపెట్టింది. చూశారా తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ ధనిక రాష్ట్రం చేసాడని చెప్పడం ప్రారంభించింది. ఇక భారత రాష్ట్ర సమితి అనుకూల సోషల్ మీడియా విభాగంలో అయితే ప్రచారం మామూలుగా లేదు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్ ఇవ్వడం మొదలుపెట్టారు. నిన్నటిదాకా మా పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిందని ఆరోపించారు. ఇప్పుడేమో కేంద్రమే ధనిక రాష్ట్రమని ప్రకటించింది. ఇంతకంటే రుజువేం కావాలి.. మా పరిపాలన వల్లే తెలంగాణ రాష్ట్రానికి ఆ ఘనత వచ్చిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పుకోవడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో కర్ణాటక రాష్ట్రం కూడా ధనిక రాష్ట్రంగా పేరు తెచ్చుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేసుకుంటున్నారు.

# ఆమె.... ప్లస్... ఇప్పుడు మైనస్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ వరంగల్, సెప్టెంబర్ 19:**
ఆదివాసీ నేత, రాష్ట్ర ప్రభుత్వంలో కీలక మంత్రి సీతక్కపై కాంగ్రెస్ పార్టీలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సీతక్క? ఆదివాసీలు ఎక్కువగా నివసించే ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించారు ముఖ్యమంత్రి రేవంత్. జిల్లా పాలనలో ఇన్‌చార్జి మంత్రికి ఎంతో ప్రాధాన్యం ఉండటం, పైగా తమ వర్గానికే చెందిన నేత, పేదల కష్టనష్టాలు తెలిసిన సీతక్కకు ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలు అప్పగించడంపై ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతనిధులు అంతా ఆనందం వ్యక్తం చేశారు. వారి అంచనాలు, ఆశలకు తగ్గట్టే తొలినాళ్లలో అందుబాటులో ఉన్న మంత్రి సీతక్క?. ఏమైందో ఏమో ఈ మధ్య అటువైపే చూడటం మానేశారంటున్నారు. దాదాపు రెండు నెలలుగా జిల్లాలో మంత్రి అడుగు పెట్టకపోవడంతో చాలా పనులు పెండింగ్‌లో పడిపోయినట్లు చెబుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నేతలు ఎవరూ ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో లేరు. దీంతో ఉమ్మడి జిల్లా పాలనా వ్యవహారాలన్నీ ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కే చూసుకోవాల్సి వుంది. ఐతే తన మంత్రిత్వ శాఖ వ్యవహారాలతోపాటు సొంత జిల్లాకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్న సీతక్క? ఉమ్మడి ఆదిలాబాద్‌పై పెద్దగా దృష్టి పెట్టడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రజల సమస్యలపైనా పెద్దగా స్పందించడం లేదని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనికి ఉదాహరణగా ఇటీవల జరిగిన పలు ఉదంతాలను చూపుతున్నారు. రైతు ఆందోళనలు, సీజనల్ వ్యాధులు, ఆదివాసీ మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా మంత్రి పట్టించుకోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ముఖ్యనేతల జిల్లా పర్యటన సమయంలోనూ మంత్రి కనిపించకపోవడం సందేహాలకు కారణమవుతోంది. సీతక్కకు ఇన్‌చార్జి మంత్రి పదవి ఇష్టం లేదా? అన్న అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేయగా, ఇన్‌చార్జి మంత్రి సీతక్క అటువైపు చూడకపోవడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశమైంది. మరోవైపు ఏజెన్సీలో డెంగ్యూతోపాటు విష జ్వరాలు ప్రబలి గిరిజనం మంచం పట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఆదివాసీ బిడ్డగా, ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క ఈ విషయంలో చొరవ తీసుకోవాలని ఆదివాసీ సంఘాలు కోరుతున్నా, మంత్రి మాత్రం ఆదిలాబాద్‌లో అడుగు పెట్టడం లేదని నిరసన వ్యక్తమవుతోంది. ఇక అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయనే టాక్ వినిపిస్తోంది. ఇన్‌చార్జి మంత్రి ఆమోదం లేక కొత్త పనులు చేపట్టే అవకాశం లేకుండా పోతోందంటున్నారు. ప్రతి నియోజకవర్గానికి స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ కింద అధికారులు ప్రతిపాదన పంపుతున్నారు. వీటికి ఆమోదం తెలపాల్సిన ఇన్‌చార్జి మంత్రి రాకపోవడంతో ఏ పనీ ముందుకు కదలడం లేదంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసమని 10 కోట్ల రూపాయల చొప్పున కేటాయించింది. కానీ, ఇన్‌చార్జి మంత్రి ఆమోదం లేక ఈ నిధులను వినియోగించుకోలేకపోతున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందడం లేదంటున్నారు. ఇవన్నీ అవ్వాలంటే ఇన్‌చార్జి మంత్రి సంతకం ఉండాల్సిందేనట.. కానీ, సీతక్క రాకపోవడంతో ఏ పనీ జరగడం లేదని కాంగ్రెస్ పార్టీ నేతలే వాపోతున్నారు. మొత్తానికి మంత్రి సీతక్క కారణంగా జిల్లా అభివృద్ధి ఆగిపోతోందనే ఆందోళన ఎక్కువగా కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా, అందరికీ అందుబాటులో ఉన్న సీతక్క.. ఇప్పుడు మంత్రిగా ఆదివాసీల ప్రాంత అభివృద్ధిపై స్లో అయ్యారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. మరి.. ఇప్పటికైనా మంత్రి సీతక్కపై వస్తున్న విమర్శలకు ఫుల్‌స్టాప్ పెడతారో? లేదో? చూడాలి.

## ఖమ్మం..వరద సాయం ఎక్కడ...ఎంత

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ ఖమ్మం, సెప్టెంబర్ 19:** చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి తెలుగు రాష్ట్రాలను వరదలు, వానలు ముంచెత్తాయి. ఏపీలోని విజయవాడను, తెలంగాణలోని ఖమ్మం జిల్లాలు వరదలో చిక్కుకున్నాయి. దాంతో ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోయారు. ఆస్తులు కోల్పోయారు. పంటలు నష్టపోయారు. ప్రాణాలూ కోల్పోయారు. వర్షాలు, వరదలు తగ్గి పది రోజులు కావస్తున్నా ఇంకా ఆ చేదు జ్ఞాపకాల నుంచి వారు బయటపడడం లేదు. బురదతో నిండిన ఇళ్లను చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా వాటిని శుభ్రం చేసుకున్నారు. విజయవాడలో జరిగిన నష్టంతో అక్కడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరద ప్రభావం తగ్గే వరకూ అక్కడే కలెక్టరేట్‌లో ఉండి పర్యవేక్షించారు. బాధితుల కష్టాలను కళ్లారా చూశారు. వారికి మనోధైర్యం కల్పించారు. జరిగిన నష్టాన్ని స్వయంగా చూడడంతో నిన్న వరద బాధితుల కోసం ఆర్థిక సహాయం ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ. 25వేల చొప్పున అందించాలని నిర్ణయించారు. అలాగే.. తక్కువ నష్టం జరిగిన వారికి తక్కువ పరిహారాన్ని ప్రకటించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు ఆ స్థాయి నిర్ణయం తీసుకున్నారు. ఇటు.. వరదల కారణంగా జరిగిన నష్టాన్ని చూసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఇతర మంత్రులు ఖమ్మం బాట పట్టారు. ప్రజలు తాము నష్టాన్ని వారి ముందుంచారు. వారు వెళ్లి వచ్చి వారం రోజులు అవుతోంది. ఇక ఇదే జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు ఉన్నప్పటికీ వారు చివరి వరకు ఉండి భరోసా కల్పించలేకపోయారనే అపవాదు ఉంది. మరోవైపు.. వరద నష్టాన్ని చూసేందుకు ప్రభావిత జిల్లాల్లో కేంద్ర బృందం సైతం పర్యటించింది. అక్కడి నష్టాన్ని అంచనా వేసింది. అంతకుముందు కేంద్ర మంత్రులు కూడా ఏరియల్ సర్వే చేశారు. దాంతో ప్రజలు తమకు తొరగానే పరిహారం వస్తుందని సంతోష పడ్డారు. ఇప్పటికే సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో జరిగిన నష్టంపై అటు కేంద్ర బృందాలు, ఇటు రాష్ట్ర బృందాలు సర్వేలు చేశాయి. వరద నష్టంపై సర్వే రిపోర్టులు సైతం ప్రభుత్వానికి ఇచ్చారు. అయితే.. కేంద్ర బృందాలతో భేటీ సందర్భంగా భారీగా నష్టపోయామని, సాయం చేయాలని సీఎం రేవంత్ కోరారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఖమ్మం బాధితులకు మాత్రం సీఎం రేవంత్ రెడ్డి ఇంతవరకు పరిహారం ప్రకటించలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దాంతో పరిహారం ఎప్పుడెప్పుడు వస్తుందా అని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీలైనంత త్వరగా పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.